నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జడ్‌పిటిసి ప్రభాకర్ రెడ్డి అకాల మరణం

- కుటుంబానికి అండగా ఉంటాం
- అంతిమయాత్రలో ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి (46) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. ప్రభాకర్‌రెడ్డి పార్థివదేహాన్ని పెద్దటేకురులోని ఆయన స్వగృహం వద్ద ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువనేత కాటసాని శివ నరసింహ రెడ్డి సందర్శించారు. పాణ్యం నియోజకవర్గ పరిధి కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం రాత్రి హైదరాబాదులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. విషయం తెలుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి, సర్పంచులు జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు అధికారులు బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు వారి స్వగ్రామం పెద్ద టేకూరు గ్రామంలో ప్రభాకర్‌రెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రభాకర్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. ప్రభాకర్ రెడ్డి అకాల మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని యువనేత శివ నరసింహారెడ్డి భరోసా ఇచ్చారు.

పోలీసు అమరవీరుల

త్యాగం మరువలేనిది

- శాంతి భద్రతలకు భరోసా పోలీసులు
- వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి
- కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు అమరవీరుల త్యాగనిరతి మరువలేనిదని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్‌జి.సృజన, జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం వారు జిల్లా పోలీసు యంత్రాంగంతో కలిసి పోలీసుల అమలవీరుల స్థూపానికి ఘన నివాళి అర్పించారు. కలెక్టర్ డాక్టర్ జి.సజన మాట్లాడుతూ దేశ సరిహద్దులో జవాన్లు రక్షణ కల్పిస్తే దేశంలో అంతర్గతంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు రక్షణ కల్పిస్తున్నారన్నారు. ఎండనక వాననక ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం పాటుపడుతున్నారన్నారు. ప్రజల రక్షణ బాధ్యతలో తమ కుటుంబాలను సైతం వెనుకకు నెట్టి శాంతిభద్రతలే ప్రధాన బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధుల్లో ఉండి అమరులైన వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎస్‌పి జి.కృష్ణ కాంత్ మాట్లాడుతూ చైనా భారత్ మధ్య జరిగిన యుద్ధంలో పదిమంది పోలీసులు విధి నిర్వహణలో ఉంటూ అక్టోబర్ 21న అమరులయ్యారని అన్నారు. ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు తమ విధులను నిర్వర్తించకపోతే అసాంఘిక శక్తులు చెలరేగి పెద్ద ఎత్తున శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయన్నారు. పోలీసుల సంక్షేమం ఆరోగ్యాన్ని పరిస్థితుల్లో మెరుగుపరిచేందుకు తగిన చర్యలను తీసుకుంటున్నామన్నారు. శాంతి భద్రతల విధుల్లో భాగంగా ప్రతి డిపార్టుమెంటుతో సమన్వయం చేసుకొని శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్, డిఎస్‌పిలు విజయ్ శేఖర్ నాగభూషణం, ఐ సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు ఇంతియాజ్ పాల్గొన్నారు.

గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

బాధితులకు వైద్య సాయం

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 19న ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చినప్పుడు పలువురు బాధితులు వారి సమస్యలను విన్నవించగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సదరు ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో బాధితుల సమస్యలను పరిష్కరించే దిశగా కలెక్టర్ చర్చించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 19న ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చినప్పుడు సమస్యలను విన్నవించిన బాధితులకు శుక్రవారం రోజున ఆర్థిక సాయం చేశామన్నారు. మిగిలిన అర్జీలలో ఎక్కువ శాతం అనారోగ్య సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధితులకు మెరుగైన వైద్య చికిత్సకోసం సంబంధిత విభాగాల వైద్యుల చేత వారిని పరీక్షించి, వారు ఇంత వరకు ఎలాంటి వైద్యం పొందారో పరిశీలించి , ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం అందించే అవకాశం ఉంటే ఆరోగ్య మిత్రల ద్వారా ఆసుపత్రిలో చేర్పించి వారికి మెరుగైన వైద్య సహాయం అందిస్తామన్నారు. జీవనోపాధి కోసం అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వారికి జీవనోపాధి కల్పించేలా డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు చేత వారికి రుణాలు ఇప్పించి వారి జీవనోపాధి కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను తీసుకొని, రిజిష్టర్ చేసి వారి విద్యార్హత మేరకు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవేళ తమ పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారులకు నివేదించి, సదరు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ పిడి సలీం బాషా, మెప్మా పిడి నాగ శివలీల, ఉపాధి కల్పన అధికారి దీప్తి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి రైజ్ ఫాతిమా, తహశీల్దార్లు వేణుగోపాల శర్మ, వెంకటేష్ నాయక్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 29న విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రాథమిక విద్య నాశనానికి కారణమైన జిఒ నెంబర్ 117ను తక్షణమే రద్దు చెయ్యాలన్నారు. ఈనెల 29న ఆదివారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఎపిటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు రాష్ట్ర అధ్యక్షులు జి. హదయ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం అన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎబిసిపై అక్రమ మోటార్లను తొలగించాలి

- రైతుల నిరసన - గుంతకల్లు ఇఇ కార్యాలయం ముట్టడి - డిఇ మంజునాథ్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు బ్రాంచి కెనాల్‌పై అక్రమ మోటార్లను, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మోటార్లను ఇరిగేషన్ అధికారులు తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆలూరు బ్రాంచి కెనాల్ (ఎబిసి) ఆయకట్టు రైతులు దాదాపు 200 మంది శనివారం గుంతకల్లు ఇఇ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సొసైటీ బ్యాంకు ఛైర్మన్ దేగులపాడు మల్లికార్జున, సర్పంచి నీలకంఠ, వైసిపి నాయకులు ఏరూరు, నగరడోన సర్పంచుల భర్తలు సేనాపతి, నాగేంద్ర, మల్లికార్జున పల్లె రామాంజనేయులు, తిమ్మాపురం హేమంత్ ఆధ్వర్యంలో అర్ధగేరి, రామదుర్గం, ఏరూరు, దేగులపాడు, నగరడోనా గ్రామాల రైతులతో కలిసి గుంతకల్లు ఇఇ కార్యాలయం చేరుకున్నారు. కాలువపై అక్రమ మోటార్లను తొలగించాలని డిఇ మంజునాథ్‌ను నిలదీశారు. సొసైటీ బ్యాంకు ఛైర్మన్ మల్లికార్జున, దేగలహాల్ సర్పంచి నీలకంఠ మాట్లాడుతూ... రైతులు మిరప పంటలను సాగు చేశారని తెలిపారు. ఆయకట్టు రైతులకు సాగు, తాగునీరు రాకుండా కాలువ పొడవునా అక్రమంగా నాన్ ఆయకట్టు రైతులు మోటార్లను పెట్టి జలచౌర్యానికి పాల్పడుతున్నారని చెప్పారు. చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసలైన ఆయకట్టు రైతుల పంటలకు నీరందక ఎండిపోయి ఆత్మహత్యలే శరణ్యమంటున్నారని వాపోయారు. జలచౌర్యానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, అక్రమ మోటార్లు తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు నిద్రావస్థలో, మామూళ్ల మత్తులో ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని వాపోయారు. ఇరిగేషన్ డిఇ మంజునాథ్ మాట్లాడుతూ... ఎవరైనా సరే పైసా ఇచ్చారంటే తాను ఉద్యోగానికి రాజీనామా చేస్తానని తెలిపారు. తాను నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తానని చెప్పారు. కాలువపై అక్రమంగా పెట్టిన మోటార్లను తొలగించడానికి ఇద్దరు ఎఇలను, లస్కర్లను, ఇద్దరు ఎస్ఐలను కాలువపై ఉంచినట్లు తెలిపారు. తాము కూడా వచ్చి ఈరోజు చెప్పి వినకపోతే రేపటి నుంచి మోటార్లను తీసుకొచ్చి చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తామని చెప్పారు. రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఈరోజు నుంచి సాగునీరు సక్రమంగా అందుతుందన్నారు. రైతులు అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. రైతులు మాట్లాడుతూ... అధికారులు తమకు సహకరిస్తే తామూ సహకరిస్తామని తెలిపారు. తమకు నీరే కావాలని, గొడవలు, అల్లర్లు అవసరం లేదని చెప్పారు. ఇరిగేషన్ డిఇ మంజునాథ్ రైతులతో కలిసి ఆలూరు బ్రాంచి కెనాల్‌పై పర్యటించి అక్రమ మోటార్లను తొలగించాలని నిబంధనలకు విరుద్ధంగా మోటార్లు పెట్టిన రైతులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్లను తీసుకెళ్లి పోలీసు స్టేషన్లో అప్పగిస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గుంతకల్లు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డిఇ మంజునాథ్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

పంటలను కాపాడండి : పంజా, దేగలపాడు రైతు

సాగునీరందించి ఎండిపోయే మిరప పంటలను కాపాడాలి. అక్రమ మోటార్లు తొలగించి నిజమైన ఆయకట్టు రైతులకు సాగునీరందించి న్యాయం చేయాలి.

నిర్బంధం..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో పలువురు నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రదర్శించారు. పలువురిని అరెస్టు చేయగా మరికొందరిని హౌస్ అరెస్టు చేశారు. కర్నూలులో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లాను ఇంట్లో నుంచి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎమ్మిగనూరులో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఆదోనిలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, కర్నూలులో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు సురేష్, నాయకులు అజిత్‌ను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆదోనిలో టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో నిర్బంధాలను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ ఓ ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన తర్వాత అరెస్టు చేసిన నాయకులను వదిలేశారు.

యుటిఎఫ్ పోరుబాట..

వైసిపి అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి గద్దనెక్కారు. ఇప్పుడు ఆ హామీని బుట్ట దాఖలు చేసి సిపిఎస్‌ను రద్దు చేస్తూ జిపిఎస్ విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ పోరుబాట పట్టింది. జిల్లా, మండల కేంద్రాల్లో సిపిఎస్, జిపిఎస్ రెండు విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ఈ పోరాటానికి ప్రతిపక్ష పార్టీలు, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలనుసారం ఆర్థిక సంస్కరణల అమల్లో భాగంగా గతంలో 2004లో ఎన్‌డిఎ ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును తీసుకొచ్చింది. ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను రద్దు చేసి సిపిఎస్ విధానాన్ని తెరమీదికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిపిఎస్ విధానం రద్దు పట్ల ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్మోహన్ రెడ్డి ఈ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని హామీఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాల పాటు మంత్రుల కమిటీ పేరుతో కాలయాపన చేశారు. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేస్తామని ప్రకటిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు. జిపిఎస్ విధానం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ కాదని ఉద్యోగ, ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు విరమణ చెందిన అనంతరం పెన్షన్ వస్తుందో, లేదో కూడా గ్యారెంటీ ఇవ్వలేని ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముక్తకంఠంతో అమలు చేసేందుకు పూనుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిపిఎస్ బిల్లును కూడా ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తోంది. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చేపడుతున్న పోరాటానికి సిపిఎం, టిడిపి, ఉపాధ్యాయ సంఘాలు ఎస్‌టియు, ఎపిటిఎఫ్ 1938, జన విజ్ఞాన వేదిక, ప్రజాసంఘాలు సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ తదితర సంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి.

మాట్లాడుతున్న ఎన్.అలివేలు, వేదికపై రాముడు, సాయిబాబా, శ్యామల

ఎల్లప్ప స్ఫూర్తితో పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం నాయకులు ఎల్లప్ప స్ఫూర్తితో కార్మికులు, ప్రజల పక్షాన పోరాటం చేయాలని సిపిఎం నగర నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో బి.ఎల్లప్ప సంతాప సభ వీకర్‌సెక్షన్ కాలనీ వార్డు పార్టీ నాయకురాలు ఎస్.శ్యామల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతాప సభకు సిపిఎం పార్టీ న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు,ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా ,ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, స్థానిక నాయకులు జి.ఏసు, ఎస్.జమ్మన్న, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.బాస్కర్ హాజరయ్యారు. ముందుగా బి.ఎల్లప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభలో నాయకులు మాట్లాడుతూ బి.ఎల్లప్ప వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉంటూ కాలనీ సమస్యల కోసం నిరంతరం పాటుపడేవాడని అన్నారు. కాలనీలో వున్న స్థానిక సమస్యలు రోడ్లు, డ్రెయినేజి కాలువలు, కరెంటు, రేషన్ కార్డులు, తదితర సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కాలనీలో అసాంఘిక శక్తులను అరికట్టడంలో ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆటో యూనియన్ నగర నాయకులు గా ఉంటూ నగరంలో అనేక ప్రాంతాల్లో ఆటో అడ్డాలను ఏర్పాటు చేసి ఆటో కార్మికులపై దాడులు ఫైన్లలకు వ్యతిరేకంగా అనేక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. తన కుటుంబంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా అరోగ్యాని కూడా లెక్కచెయకుండా నిరంతరం సిపిఎం, ఆటో కార్మిక సంఘం అభివృద్ధి కోసం పాటుపడ్డారని ఎల్లప్పను కొనియాడారు.

లోక్ అదాలత్‌లో 35 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ప్రత్యేక లోకాదాలత్‌లో 35 రోడ్డు ప్రమాద కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాస కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లీశ్వరి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. ప్రతిభాదేవి, సభ్యులు కెంగర కుమార్, నిర్మల పాల్గొని 16 కేసులు పరిష్కారం చేసి రూ. ఒక కోటి డెబ్బై లక్షలు లబ్ధిదారులకు చెల్లించేందుకు బీమా కంపెనీలు అంగీకారం చేసుకున్నాయి. ఆదోనిలో రెండు కేసులు, నంద్యాల లో 15కేసులు, ఆళ్లగడ్డలో రెండు కేసులుఇలా మొత్తం 35 కేసులు పరిష్కారం చేశారు.

నవంబర్ 8న విద్యాసంస్థల బంద్

కపడ ఉక్కు పరిశ్రమ సాధనకు యువజన విద్యార్థి సంఘాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని, అందులో భాగంగా నవంబర్ 8న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు తెలిపారు. శనివారం కర్నూలు సిఆర్ భవన్‌లో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఉమ్మడి కర్నూలు జిల్లా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. అనేక పోరాటాలు 32 మంది విద్యార్థి యువజనల ప్రాణ త్యాగాలతో ఏర్పాటు చేసుకున్నటువంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమని, దీనికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని, నవంబర్ 8 నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు 1000 రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు ప్రత్యక్షంగా ఆందోళనలు పాల్గొనడం తో పాటు ఆరోజు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, పార్లమెంట్ నిర్మాణానికి కూడా ఉక్కునందించిన వంటివి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఎలా ప్రైవేటీకరణ చేస్తానని ప్రశ్నించారు.

అభివాదం చేస్తున్న విద్యార్థి, యువజనసంఘాల నాయకులు

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ తోనే యువతకు ఉపాధి అవకాశాలు

అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధి కావాలంటే రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చినటువంటి హామీ మేరకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, దాని ద్వారానే రాయలసీమ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగాలు దొరుకుతాయని ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషి చేయాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఈనెల 28న రౌండ్ టేబుల్ సమావేశం కర్నూలులో నిర్వహించాలని నిర్ణయించారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చంద్రబాబు నాయుడు క్లీన్ చిట్‌తో బయటకు వస్తారని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శనివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన అర్ధనగ్న ప్రదర్శనలో టిజి.భరత్ పాల్గొన్నారు. చంద్రబాబుకు న్యాయం జరగాలని ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. టిజి.భరత్ మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేసి జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై కేవలం ఆరోపణలు చేస్తున్నారని.. ఆధారాలు మాత్రం లేవన్నారు. 43 రోజులుగా కర్నూల్లో తాము నిరసనలు చేస్తూనే ఉన్నామన్నారు. సుప్రీంకోర్టులో ఆయనకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు భరత్ చెప్పారు. టిడిపి నేతలు సత్రం రామక్రిష్ణుడు, ఎల్లప్ప, అబ్బాస్, జూటూరు రవి, శివరాజ్, గున్నామార్క్, తిమ్మోజీ, సుంకన్న, రామాంజనేయులు, మోహన్, వెంకటేష్, ప్రభాకర్, రాజశేఖర్, ఏసు, అజయ్, మణి ప్రకాష్, రాజశేఖర్ రెడ్డి, అఖిల్, శ్రీను, రఫిక్, తిమ్మారెడ్డి, పాల్ రాజ్, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయం వద్ద టిడిపి అర్ధనగ్న ప్రదర్శన

అయోడిన్ డిఫీషియన్సీపై అవగాహన అవసరం

డిఎంహెచ్ఒ డాక్టర్ రామ గిడ్డయ్య

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రతిఒక్కరూ అయోడిన్ డిఫీషియన్సీపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య అన్నారు. శనివారం జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు డిఎంఅండ్‌హెచ్ఒ రామగిడ్డయ్య ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ దినోత్సవర్యాలీ నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మనం తీసుకొనే ఆహారంలో అయోడిన్ లోపిస్తే పలుఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఎదురువు తాయని తెలిపారు. అయోడిన్ ఉప్పు గర్భినీలలో పిండం మాములుగా ఎదిగేందుకు సహాయ పడుతుందని, చిన్న పిల్లల్లో సరైన శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన ఒక ముఖ్య పోషక పదార్థమని తెలిపారు. ఆర్‌బిఎస్‌కె పిఒ హేమలత, డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిపిఎంయు డాక్టర్ ఉమా, డెమోప్రమీలమ్మ, డిపిఒ విజయరాజు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో ప్రదర్శన

జిపిఎస్ రద్దుకు ఎస్‌టియు దీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిపిఎస్‌ను రద్దు చేసి, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావలసిన ఆర్థిక బకాయిలు చెల్లించకుంటే ఈ ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయినట్లేనని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న హెచ్చరించారు. శనివారం నగరంలోని శ్రీకష్ణదేవరాయ సర్కిల్ ధర్నా చౌక్‌లో ఎస్‌టియు ఆధ్వర్యంలో ఆక్రందన దీక్షలను చేపట్టారు. దీక్షా శిబిరానికి జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఇ .షన్ముర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు సి.రమేష్, రాష్ట్ర మాజీ కార్యదర్శులు మహమ్మద్ షఫీ, బసవరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నాగరాజు, బి.దేవప్రసన్నరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయకుండా జాప్యం చేయడం తగదన్నారు. వెంటనే జిపిఎస్. సిపిఎస్ విధానాలను రద్దుచేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ దీక్షలకు సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఎఐటియుసి నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా కన్వీనర్ పద్మావతి మద్దతు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఈర్లదిన్నెలో రైతుభరోసా పనులు ముమ్మరం

ప్రజాశక్తి-సి బెళగల్

సిబెళగల్ మండలం ఈర్లదీన్నెలో రైతుభరోసా కేంద్రం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం స్లాబ్ వేస్తుండగా డిఇ మహేశ్వర్ రెడ్డి, ఎఇ ఇంటియాజ్ బాషాలు పరిశీలన చేశారు. నాణ్యతగా నిర్మించాలని, సకాలంలో పనులను పూర్తి చేయాలని వారు గుత్తేదారులకు సూచించారు.

సాంప్రదాయబద్ధంగా బన్ని ఉత్సవం

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆలూరు/హోళగుంద

దేవరగట్టులో పర్యటిస్తున్న అభిషేక్ కుమార్

దేవరగట్టులో వెలసిన మాలమల్లేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా బన్ని ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శనివారం ఆలూరు ఎంపిడిఒ కార్యాలయంలో దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి సన్నిధిలో బన్ని ఉత్సవం సందర్భంగా సబ్ డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దసరా బన్ని ఉత్సవాల సందర్భంగా భక్తులకు, ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని కోరారు. దేవరగట్టు ప్రాంతం మొత్తం ప్రకాశవంతంగా ఉండేందుకు ఎత్తయిన లైట్లు, జనరేటర్ ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ రఘునాథ్ రెడ్డిని ఆదేశించారు. ఈ ఉత్సవాల్లో మద్యాన్ని వాడకుండా, కర్రలు తీసుకొని రాకుండా, సాంప్రదాయబద్ధంగా, క్రమశిక్షణతో జరుపుకోవడానికి పరిసర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఎస్‌పికి సూచించారు. రాత్రిపూట స్పష్టంగా కనిపించే కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా అసాంఘిక శక్తులు, క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం దేవరగట్టులోని శ్రీమాలమల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని క్షేత్రస్థాయిలో స్థల ప్రాంతాన్ని పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఆర్‌ఐ దినేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మహ్మద్ షఫీ, విఆర్‌ఒ నాగరాజు, విద్యుత్ ఇఇ సుధాకర్ బాబు పాల్గొన్నారు.

రీసర్వే నోటీసులపై రైతుల ఆగ్రహం

- చేసేదేమీ లేక వెనుదిరిగిన ఆర్‌డిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి-ఆలూరు

అధికారులపై ఆగ్రహిస్తున్న రైతులు

రైతుల పంట పొలాల రీసర్వే చేసిన ఫారం-46ను రైతులకు అందజేసిన వాటిలో తమ భూములు తక్కువ చూపిస్తున్నారని రైతులు అధికారులపై ఆగ్రహించారు. గడిచిన రోజులుగా రైతుల పొలాలను రీసర్వే చేసి ఈనెల 1న రైతులకు అభ్యంతరాలపై శనివారం నోటీసులు ఇచ్చారు. ఆర్‌డిఒ మోహన్ దాస్, తహశీల్దార్ రామాంజనేయులు కురువళ్లి గ్రామ రైతులతో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన ఫారం-46 నోటీసులో అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలని తెలపడంతో రైతులు ఒక్కసారి అధికారులపై ఆగ్రహించారు. తాత, ముత్తాతల నుంచి వచ్చిన భూములను తక్కువ చూపుతూ, రూ.లక్షలు పోసి కొన్నప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు సెంట్లు, ఎకరాల్లో తేడా చూపుతూ రైతులను ప్రభుత్వం, అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల భూములు తక్కువ చూపిస్తే ఒప్పుకుంటారా అని మండిపడ్డారు. గ్రామాల్లో రైతులు కలిసిమెలిసి ఉన్న చోట రీసర్వే చేసి కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ చూపి గొడవలు పెడుతున్నారని పేర్కొన్నారు. తమకు ఏ సర్వే వద్దని, కాదు కూడదని అధికారులు రికార్డులు మార్చితే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. సర్వేయర్ అరుణ జ్యోతి, విఆర్‌ఒ బ్రహ్మానందం పాల్గొన్నారు.

అవినీతికి నిలయం...

తహశీల్దార్ కార్యాలయం... - చేయి తడపనిదే ఫైలు కదలదు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని తహశీల్దార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. మామూళ్లు ఇవ్వనిదే అక్కడ ఏ పనులు జరగవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు తెలిసింది. అటెండర్ నుంచి అధికారుల వరకు ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

మండలంలోని మారుమూల గ్రామంలో సుమారు 6 ఎకరాల భూమిపై కోర్టులో ఉన్న భూమికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇవ్వడంలో రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు దండుకున్నట్లు సమాచారం. మరో అధికారి తహశీల్దార్ కిందిస్థాయి అధికారైనప్పటికీ అంతా తానే నడిపిస్తున్నట్లు, ప్రతి పనికీ ఓ రేటు పెట్టి వసూలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలపై మరో ఇంటి పట్టా సృష్టించడం, ఇద్దరి మధ్య వివాదం పెట్టి దాని పరిష్కరిస్తున్నట్లు చేసి ఒకరికి న్యాయం చేసే విధంగా అధికారి చలామణి అవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ పని చేయాలన్నా అధికారి చేయి తడపనిదే ఫైలు కదలదు. మరో విఆర్‌ఒ ఒక పట్టాదారు పాసు పుస్తకానికి రూ.5 వేలు ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నట్లు సమాచారం. పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారిని అధికారులు, సిబ్బంది నెలల తరబడి తిప్పుకుంటున్నట్లు తెలిసింది. సకాలంలో పనులు జరగక విసుగు చెందిన ప్రజలు కార్యాలయంలో ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకుంటున్నట్లు సమాచారం. అంతటితో ఆగకుండా అక్రమంగా భూముల పట్టాలను అటు ఇటుగా మార్పిడి చేస్తూ ప్రజలను నిలువుదోపిడి చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా అధికారులు కంకణం కట్టుకున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. అక్రమాలకు తోడు భూముల ధరలు ఆకాశాన్నంటడం వారికి కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. కార్యాలయానికి వచ్చే దళారుల ద్వారా సైతం అధికారులు రాయబారం నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కార్యాలయంలో మరో అధికారి గత కొంత కాలం నుంచి ఇక్కడే తిష్టవేసి అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారినట్లు సమాచారం. ఈ అధికారి ఎక్కడ పని చేసినా ఇదే వ్యవహారం ఉంటున్నట్లు ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. కొంతమంది అధికారులను ఇక్కడి నుంచి తప్పిస్తేనే కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టవచ్చని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

పట్టణ శివారు మండిగిరి పరిధిలో ఆర్ట్స్ కళాశాల వెనుక సుమారు 5 ఎకరాల స్థలంలో 1987లో కలెక్టర్ ఆదేశాల మేరకు లే అవుట్ ప్లాట్లు వేసి

తహశీల్దార్ కార్యాలయం

రెవెన్యూ శాఖ ఉద్యోగులకు మార్కెట్ ధరకు కేటాయించారు. 2019లో నిబంధనలను తుంగలో తొక్కి కేవలం ఆదోని తహశీల్దార్ స్థాయిలోనే ఇదే లే అవుట్‌ను ఇష్టానుసారంగా మార్చేశారని విమర్శలు ఉన్నాయి. ఇద్దరు గత రెవెన్యూ శాఖ ఉద్యోగులు చక్రం తిప్పి ఈ ప్లాట్లను బయటి వ్యక్తులకు అమ్మడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు వార్తలు వచ్చాయి. అందులో ఒకరు ప్రస్తుతం జిల్లా స్థాయి ఉద్యోగంలో ఉన్నట్లు తెలిసింది. చివరకు ఈ అక్రమ భూ వ్యవహారంపై సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రెవెన్యూ కాలనీ లే అవుట్ అక్రమ మార్పునకు వ్యతిరేకంగా లోకాయుక్తలో ఫిర్యాదు చేయాలని ఆదోని జిల్లా సమితి సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ట్యాక్సీ ప్లేట్ స్థానంలో వైట్ ప్లేట్... తహశీల్దార్ నిర్వాకం

ప్రభుత్వ సొమ్మును అడ్డదారుల్లో సొంత పనులకు వాడుకునేందుకు అధికారులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. తహశీల్దార్ సొంత కారు వైట్ ప్లేట్ నెంబర్ వాడుతున్నారు. ప్రభుత్వం తహశీల్దార్లకు ప్రయాణ భత్యం కింద ప్రతినెలా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లిస్తోంది. అందుకు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత వాహనాలను ఉపయోగించరాదు. అదే సమయంలో కేవలం ట్యాక్సీ ప్లేట్ (ఎల్లో ప్లేట్) వాహనాలను మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వం వాహనం కేటాయిస్తే దానికి సంబంధించిన ఖర్చులను భరిస్తుంది. ఎలాంటి నగదు కూడా చెల్లించదు. ప్రభుత్వ వాహనం అందుబాటులో లేకుంటే నిరుద్యోగులు డ్రైవింగ్ వృత్తి చేసుకుని ఉపాధి పొందేందుకు ఇలాంటి నిబంధనలు విధించారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ సొంత వాహనాలు వాడుతూ రెంట్ వాహనాలను వాడుతున్నట్లు తప్పుడు లెక్కలు చూపుతూ ప్రతినెలా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహశీల్దార్‌ను వివరణ కోరగా... తన సొంత వాహనమే ఉపయోగిస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

అవినీతిని నిర్మూలించాలి - లింగన్న, సిపిఎం మండల కార్యదర్శి

తహశీల్దార్ కార్యాలయంలో ఏ అధికారి సమయానికి రావడం లేదు. కోర్టులో ఉన్న వివాదాల్లో ఇష్టానుసారంగా తలదూర్చడం, ప్రజా సమస్యలను గాలికొదిలేసి సొంత ప్రయోజనాలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం సరి కాదు. తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి మితిమీరిపోయింది. దీనిని నిర్మూలించేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

చెరువుకు గండి పూడ్చాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన రైతులు

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

పంటలకు సాగునీరందించే చెరువుకు గండిపడి నాలుగేళ్లు గడిచినా కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని, వెంటనే చెరువుకు గండి పూడ్చాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ చెరువు నుంచి సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. వరి, మిరప, పత్తి, ఉల్లి పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం కోల్పోయారన్నారు. నాలుగేళ్ల క్రితం చెరువుకు గండిపడడంతో మూసానపల్లె, చిన్నహోతూరు, చిగిలి గ్రామాల రైతులు సాగునీటిని నోచుకోవడం లేదని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీ, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం గండి పూడ్చలేని దీనస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేసి ఉంటే నీరు నిలిచి పంటలకు సాగునీరందేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గండి పూడ్చకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మూసానపల్లెలో సుమారు 70 మంది రైతులు బోర్లు వేయించుకున్నా నీరు రాని పరిస్థితి ఉందన్నారు. చెరువులో నీరు నిలిచి ఉంటే భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా ఉండేదని తెలిపారు. వేదవతి నిర్మిస్తామని చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదన్నారు. మేళిగనూరు వరద కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని కోరారు. రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. చెరువుకు గండి పూడ్చి వచ్చే వర్షాకాలంలోనైనా నీరు నిలిచేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుసంఘం జిల్లా సహాయ కారదర్శి హనుమంతు, రైతుసంఘం ఆలూరు కార్యదర్శి రంగస్వామి, ఆస్పరి కార్యదర్శి ఈరన్న, రైతులు ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్ఐ వేణుగోపాల్ రాజు కొనియాడారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉమేష్ చంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా త్యాగాలు చేసిన వారు ఎందరో ఉన్నారని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు, ప్రజా రక్షణకు ప్రాణాలు కోల్పోయిన వారికి జోహారు అంటూ సెల్యూట్ చేశారు. ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, పోలీసులు చెన్నబసప్ప పాల్గొన్నారు.

సొసైటీ మాజీ ఛైర్మన్‌కు మాతృవియోగం

- రంజన్ ప్రసాద్‌కు సానుభూతి తెలిపిన మంత్రి గుమ్మనూరు జయరామ్, వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బెల్డోన సొసైటీ మాజీ ఛైర్మన్ వైకుంఠం నిరంజన్ ప్రసాద్ తల్లి లలితమ్మ (80) మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ శనివారం చిప్పగిరిలోని నిరంజన్ ప్రసాద్ ఇంటికి చేరుకొని లలితమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిరంజన్ ప్రసాద్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, జడ్‌పిటిసి విరుపాక్షి, వైసిపి కన్వీనర్ మారయ్య, చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు, వైస్ ఎంపిపి నరసింహులు, ధర్మేంద్ర, షేకన్న, రాజన్న, సూరి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, మండలంలోని వైసిపి నాయకులు, టిడిపి నాయకులు పాములు, సన్నప్ప, శివలింగ, సంజీవ రాయుడు లలితమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జయరామ్

'ప్రజా రక్షణభేరి'ని జయప్రదం చేయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోని

'ప్రజారక్షణ భేరి'ని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి లింగన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రాజెక్టులు నిర్మించాలని, కరువుతో అల్లాడిపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. విద్యుత్ యూనిట్ రూపాయికే ఇవ్వాలని, పేదలకు 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్ ఇవ్వాలని కోరారు. ఇసుక ఉచితంగా, తలకు పది కిలోల ఉచిత బియ్యం, పప్పు నూనెల సరఫరా, నిత్యావసర ధరల తగ్గించాలని డిమాండ్ చేశారు. పేదలకు రెండు సెంట్ల ఇల్లు, రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్లకు పట్టాలు, కొత్తకాలనీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో 'ప్రజా రక్షణ భేరి'లో భాగంగా ఈనెల 30న రాష్ట్రస్థాయి బస్సుజాతా ఆదోని నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల గురించి మాట్లాడుతున్నాయే తప్ప రాష్ట్రాభివృద్ధి, రైతుల కరువు సమస్యపై ఎవరూ మాట్లాడే పరిస్థితి లేదని తెలిపారు. సిపిఎంగా ప్రజా సమస్యలను అజెండాగా చేర్చి పోరాడుతున్నట్లు చెప్పారు. ఈనెల 30న ఆదోని నుంచి ప్రారంభమయ్యే బస్సు జాతా కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, సత్యసాయి, పల్నాడు జిల్లాలను కలుపుతూ నవంబర్ 9న విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభతో ఈ ప్రచార భేరి ముగుస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, ఆదోని పట్టణ కార్యదర్శి డి.లక్ష్మణ్, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి హనుమంతు, పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కోసిగి మండల కన్వీనర్ రాముడు, కౌతాళం మండల కన్వీనర్ వీరన్న, సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

మంత్రాలయం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు విస్మరించిన నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30న ఆదోని నుంచి ప్రారంభమవుతున్న 'ప్రజారక్షణ భేరి' బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు కోరారు. స్థానిక ప్రయివేట్ అతిథిగృహంలో సిపిఎం మండల కార్యదర్శి జయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో మూడు బస్సు యాత్రలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఆదోనిలో బస్సు యాత్ర ప్రారంభానికి రైతు సంఘం జాతీయ నాయకులు అశోక దావులే హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, మహిళల సమస్యలు పరిష్కారానికి ప్రచార భేరి యాత్రలు చేపట్టినట్లు చెప్పారు. బస్సు యాత్రకు అనుబంధంగా మండలాల్లోనూ యాత్రలు కొనసాగిస్తామన్నారు. మంత్రాలయం మండలంలో ఈ నెల 2న మండల జాతాను నిర్వహించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సిపిఎం నాయకులు ప్రాణేష్, వీరేష్, ఆంధ్రయ, పౌలు, నాగరాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని గురజాల గ్రామానికి రైతు కురువ రాముడు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండేళ్లుగా పంటలు సరిగా పండకపోవడంతో రాముడు మనస్తాపానికి గురై 19న గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు శనివారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి : జడ్‌పిటిసి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలో రూ.40 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టుతున్నట్లు, పనుల్లో నాణ్యతను పాటించాలని జడ్‌పిటిసి కిట్టు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం దేవనకొండ చాకలి వీధికి వెళ్లే రహదారి వెంట నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు సంక్షేమంతో పాటు మరోవైపు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టుతున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కొత్తపేట రహదారి కూడా పనులు ప్రారంభించినట్లు చెప్పారు.

వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా బొజ్జమ్మ

ప్రజాశక్తి- దేవనకొండ

వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా కప్పట్రాళ్ల బొజ్జమ్మను నియమిస్తూ తాడేపల్లి సిఎంఇఒ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు మాజీ ఎంపిపి, ఆమె భర్త రామచంద్ర నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. వైసిపిలో చేరిన కొద్ది నెలలకే తమ సేవలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమకు ఈ పదవి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే టిడిపితోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం కోసిగిలోని 9వ వార్డులో 'బాబుతో నేను'

కోసిగిలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, జగన్మోహన్ రెడ్డి చేస్తున్న మోసాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో టిడిపిని ఆదరించాలని, మంత్రాలయం నియోజకవర్గంలో పాలకుర్తి తిక్కారెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే తిక్కారెడ్డితోనే సాధ్యమన్నారు. టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ భరద్వాజ్ శెట్టి, వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, పంపాపతి, కొండగేని వీరారెడ్డి, రవితేజ శెట్టి, గవిగట్టు ఈరయ్య, గుండాల ఈరయ్య, నాడిగేని వీరారెడ్డి, చిన్నభూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జనార్ధన్, ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మారెప్ప, ఎంపిటిసి రాజు, మారేష్, నర్సారెడ్డి, లక్ష్మి కాంత్, గోపాల్, డీలర్ నరసన్న, వడ్డే రామయ్య, ఖలందర్, దాదా ఉసేని, కప్పయ్య, లసుమయ్య, శ్రీనివాసులు, శ్యాంసుందర్, నీలకంఠ, దుద్ది నాగేష్, హనుమంతు, దొడ్డయ్య, నారా లోకేష్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరులో 'బాబుతో నేను' నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు మల్లికార్జున, వీరేష్ గౌడ్, నరసన్న, మహాదేవ, బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.

పెద్దకడబూరులో

ప్రజల సంక్షేమమే లక్ష్యం

- వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ప్రదీప్ రెడ్డి, మహేందర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కామవరం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయో ప్రజలను అడిగి

ప్రజలతో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించే నాయకులని తెలిపారు. అనంతరం కామవరం గ్రామానికి చెందిన దస్తగిరి సాబ్ కుమారులు ఇర్ఫాన్, ఇమ్రాన్ అంగవైకల్యం చూసి ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు చెప్పారు. వైసిపి సీనియర్ నాయకులు వీరసేనారెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, వెంకటరామిరెడ్డి, సర్పంచి వసంత్ కుమార్ పాల్గొన్నారు.

వారానికోసారి నీరు : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

వారానికో రోజు నీరు వదులుతున్నారని, వారానికి రెండుసార్లు కావాలని చాలామంది ప్రజలు అడుగుతున్నారని, అక్కడక్కడ పబ్లిక్ ట్యాప్స్ పెట్టాలని కూడా అడుగుతున్నారని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం ఆదోనిలోని మండగిరి గ్రామ పంచాయతీలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. పర్యటించి వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొన్నిచోట్ల డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కిరాయిత సుదర్శన్ అనే అబ్బాయికి వికలాంగుల కింద పింఛను మంజూరు చేయాలని కోరారు. ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మురళీ, పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, బాబురావు, రవి, శాంతరాజ్, చిరంజీవి, భారత్, వీరేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న కృష్ణమ్మ

జల జగడం - వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కౌతాళం

గాయపడిన రైతు శివరాజ్

సాగునీటి కోసం తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని డిస్ట్రిబ్యూటర్ కాలువలపై జల జగడాలు (సాగునీటి యుద్ధాలు) మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతున్నాయి. దిగువ కాలువ సాగునీటి కోసం రైతుల మధ్య పోటీ పెరిగింది. పంటలు కాపాడుకోవడానికి రాత్రి, పగలు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటి కోసం ఘర్షణ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని టిఎస్ డిస్ట్రిబ్యూటర్ నీటిని ఆయా గ్రామాల పెద్దల సమక్షంలో వంతుల వారీగా నీటిని పొలాలకు వినియోగించుకునేలా తీర్మానించారు. ఈ కాలువ పరిధిలోని కుంటనహళ్, నగరహాల్, ఉప్పరహాల్, రౌడూరు గ్రామాలకు నీటి సరఫరా కావాల్సి ఉంది. ఉప్పరహాల్ గ్రామానికి వంతు రావడంతో గ్రామానికి చెందిన రైతు శివరాజ్ నీటి కోసం కాలువపైకి వెళ్లారు. కాలువపై కుంటనహాల్ గ్రామానికి చెందిన రైతులు లింగన్న కుమారులు రమేష్, నాగరాజు ముగ్గురు కలిసి కట్టెతో దాడి చేయడంతో శివరాజ్ వెన్నెముక విరిగింది. ఈ విషయంపై కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గాయపడిన రైతు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి వెళ్లగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు సూచించినట్లు చెప్పారు. అక్కడి వైద్యులు మూత్రపిండాలు వాపు వచ్చాయని, వెన్నెముక మూడు చోట్ల విరిగిందని రైతు తెలిపారు. సాగునీటి కోసం అక్కడక్కడ ఘర్షణలు జరుగుతున్నా వెలుగులోకి రావడం లేదు. ఘర్షణలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గాయపడిన రైతుకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారిని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం స్థానిక మల్లారి వీధి సమీపంలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయానికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వెళ్లి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కెపి.వీరన్న శెట్టి, మురారి రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, కుమార్, వైసిపి నాయకులు దర్మకారి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: ADONI.

O.S.No.304/2021

Between:

Katike Shaik Ahmed and 3 others ... Plaintiffs.

-V/S-

Katike Yakub and another . .. Defendants.

SUMMONS TO DEFENDANT No.1

To

D.1. Katike Yakub, s/o.Late Mabu Sab, Agriculturist, Teru Bazar, Near Rayalaseema Pragathi Grameena Bank, KOSIGI, Kurnool Dist.

Whereas the above named Plaintiffs filed the above suit against you and another for partition of the Plaint schedule property. You are hereby summoned to appear before this Hon'ble Court on 31.10.2023 at 10.30 A.M. either in person or through an Advocate to file any objection. If you fail to appear the case will be heard and decided ex-parte.

// BY ORDER OF THE COURT//

T.MALLIKARJUNA RAO,
ADVOCATE FOR PLAINTIFF,
ADONI.

ప్రజారోగ్యమే వైసిపి ధ్యేయం : సర్పంచి నెల్లూరప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచి నెల్లూరప్ప తెలిపారు. శనివారం మండలంలోని జొహరాపురం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వృద్ధులకు, గర్భిణులకు షుగర్, బిపి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ మారుతి కుమార్ మాట్లాడుతూ... గ్రామంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో 408 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. స్పెషలిస్టులు గీతావాణి, డాక్టర్లు మాధవి లత, రోషిని పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' టోకెన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎఎన్‌ఎంలు పుష్పవతి, లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పి కృష్ణవేణి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వేతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 27న 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపునకు వైద్యుల బృందం హాజరవుతారని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందజేయడం 'జగనన్న ఆరోగ్య సురక్ష' ధ్యేయమని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాలహర్వి : పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహిస్తోందని ఎంపిడిఒ ఆంథోని తెలిపారు. నిట్రవట్టి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులను జడ్‌పిటిసి లింగప్ప, సర్పంచి గాదిలింగప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'సురక్ష' ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఐసిడిఎస్ చందన, ఈరన్న, మన్సూర్ వలీ, తిమ్మన్న, గంగాధర్, గైనకాలజిస్ట్ మెహరున్నీసా పాల్గొన్నారు.

హాలహర్వి : సురక్ష నిర్వహిస్తున్న అధికారులు

ప్రజలను రక్షించేది పోలీస్ వ్యవస్థ ఒక్కటే

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

యావత్ ప్రపంచం నిద్రపోయినా ప్రజలను రక్షించేది పోలీస్ వ్యవస్థ ఒక్కటేనని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. శనివారం నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నందికొట్కూరు, పాణ్యం ఎమ్మెల్యేలు తోగూర్ ఆర్థర్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, జల వనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తదితరులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సమాజమే కుటుంబంగా భావించి సొంత కుటుంబాలను కూడా పక్కనపెట్టి నిర్విరామంగా పని చేసే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన కానిస్టేబుల్ నరేంద్రనాథ్, హెూంగార్డు రాజశేఖర్లు రౌడీ మూకలను నిలువరించే ప్రయత్నంలో చనిపోవడం బాధాక రమన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన సహాయ కార్యక్రమాలలో తన పూర్తి స్థాయి తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లాలో పోలీసులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి విద్య, వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. తన తండ్రి తనను ఆర్మీకి పంపాలనుకుని తమపై ప్రేమ వల్ల పంపలేకపోయిన విషయం తరచూ చెప్పేవారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నంద్యాల జిల్లా అంటే ఫ్యాక్షన్ ప్రాంతమనే ముద్ర తొలగించుకుని అత్యున్నత పరిపాలన వ్యవస్థ ఉన్న జిల్లాగా అవతరించామని, అందుకు కృషి చేస్తోన్న పోలీసుల సేవలను మంత్రి ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తూ ఘనంగా నివాళు లర్పిస్తున్నా మన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో కానిస్టేబుల్, హెూంగార్డు మరణాలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, అందరి సహకారంతో శాంతి భద్రతలను కాపాడగలిగామన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన

బాధితులకు రూ. 23 లక్షల 45 వేలు చెక్ అందజేత

నంద్యాల పట్టణం గాంధీ చౌక్ ఫ్రూట్ మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 14 మంది బాధిత వ్యాపారులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ. 23 లక్షల 45 వేలు చెక్‌ను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి కొంత మేర నష్టపరిహారాన్ని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వెజిటేబుల్ అండ్ ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధి కలాం, సభ్యులు, వైసిపి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నందికొట్కూరు : నందికొట్కూరు టౌన్, రూరల్ సీఐలు ప్రకాష్ కుమార్, విజయ భాస్కర్‌ల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయం నుండి పటేల్ సెంట్రల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎన్వి రమణ, సిపిఐ రఘురాంమూర్తి, రమేష్, టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.రాజన్న, విద్యార్థి సంఘం నాయకులు రంగ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ పోరుబాట..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉద్యోగ ఉపాధ్యాయులకు అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి గద్దనెక్కారు. ఇప్పుడు ఆ హామీని బుట్టదాఖలు చేసి సిపిఎస్ రద్దు చేస్తూ జిపిఎస్ విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరుబాట పట్టింది. జిల్లా, మండల కేంద్రాల్లో సిపిఎస్, జిపిఎస్ విధానాలు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ఈ పోరాటానికి ప్రతిపక్ష పార్టీలు, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలనుసారం ఆర్థిక సంస్కరణల అమల్లో భాగంగా గతంలో 2004లో ఎన్‌డిఎ ప్రభుత్వం పిఎఫ్ ఆర్‌డిఎ బిల్లును తీసుకువచ్చింది. ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను రద్దు చేసి సిపిఎస్ విధానాన్ని తెరమీదకి తీసుకువచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఆమోదం తెలిపారు. అయితే రాష్ట్రంలో గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిపిఎస్ విధానం రద్దు పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్మోహన్ రెడ్డి ఈ విధానానికి రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని హామీనిచ్చారు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల పాటు మంత్రుల కమిటీ పేరుతో కాలయాపన చేసింది. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేస్తామని ప్రకటిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు. జిపిఎస్ విధానం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ కాదని ఉద్యోగ ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు విరమణ పొందిన అనంతరం పెన్షన్ వస్తుందో లేదో కూడా గ్యారెంటీ ఇవ్వలేనిఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముక్తకంఠంతో అమలు చేసేందుకు పూనుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిపిఎస్ బిల్లును కూడా ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుంది. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చేపడుతున్న పోరాటానికి సిపిఎం, తెలుగుదేశం, ఉపాధ్యాయ సంఘాలు, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ 1938, జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాలు సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ తదితర సంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి.

అవీ.. ఇవీ.. అన్నీ...

ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో టిడ్కో గృహాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు ప్రారంభించారు. మిడుతూరు మండల కేంద్రానికి చెందిన పేదలకు 1996లో ఇచ్చిన పట్టా పాస్ పుస్తకాలకు భూములు చూపించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితులు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం, సిఐటియు, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, బిసి సంఘం నాయకులు ధర్నాకు సంఘీభావం తెలియజేశారు. జిల్లాలో దసరా నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీశైల క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

ప్రాజెక్టులలోకి చేరని నీరు..

జిల్లాలోని ప్రాజెక్టులలోకి వరద నీరు వచ్చి చేరడం లేదు. ఎగువన వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయానికి చుక్క నీరు కూడా రావడం లేదు. అలాగే తుంగభద్ర జలాశయానికి కూడా ఎగువ నుండి నీరు వచ్చి చేరడం లేదు.

31న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర

- జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

అసమానతలు లేని అభివృద్ధి కోసం, సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం ఈ నెల 31న ఆత్మకూరు పట్టణంలో జరిగే ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్‌లు కోరారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం మండల కార్యదర్శి నరసింహ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు సొంత అజెండాల చుట్టూ తిరుగు తున్నాయని, ప్రజా సమస్యల చుట్టూ మళ్ళించాలనే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉందని, 339 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించి కరువు నుంచి కాపాడాలని సూచించారు. ప్రజలకు తాగేందుకు మంచినీరు కూడా లేదని, విష జ్వరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి జ్వరాలకు మూల కారణాలను గుర్తించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో దసరా పండగ సందర్భంలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పప్పు, నూనె ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని విమర్శించారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో దేశంలో, రాష్ట్రంలో దాడులు ఎక్కువయ్యాయని, ఈ దాడులను కాంగ్రెస్, వైసిపి, టిడిపి, జనసేన రాజకీయ పార్టీలు ఖండించకపోగా కలిసి పోటీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ప్రజలు, కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధికి ఎటువంటి విధానాలు కావాలనే అంశంపై చర్చించి సిపిఎం ఆధ్వర్యంలో తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉండే ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజాపక్షమా లేక బిజెపి పక్షమో తేల్చుకోవాలన్నారు. ఈ నెల 31న ఉదయం 11:30 గంటలకు ఆత్మకూరు పట్టణంలో జరిగే ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో పట్టణ ప్రజలు, మేధావులు, లౌకికవాదులు, ప్రజాతంత్ర వాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, పాములపాడు మండల కార్యదర్శి సామన్న, నాయకులు టి వెంకటేశ్వర రావు, శంకర్ రెడ్డి, సంజీవ రాయుడు, మాబాష, సుధాకర్, వీరన్న, సురేంద్ర, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం

కాళరాత్రిగా అమ్మవారు

- గజ వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో శనివారం కాళరాత్రి అలంకారంలో అమ్మవారు, గజ వాహనంపై స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహోత్సవాలలో భాగంగా ఏడవ రోజు అమ్మవారికి కాళరాత్రి అలంకారంలో అలంకరించి, గజ వాహనంపై స్వామిఅమ్మవార్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావర ణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహెూమం, చండీహెూమం, చతుర్వేద పారాయణలు, రుద్ర పారాయణ, చండీ పారాయణ, జపానుష్ఠానాలు, వంటి పూజా కార్య క్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఆస్థాన సేవ, సువాసిని పూజలు చేశారు.

గ్రామోత్సవం : దసరా మహోత్సవాలలో భాగంగా కాళరాత్రి అలంకారంలో ఉన్న అమ్మ వారిని, గజ వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనలతో ఆలయ రాజ గోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపచేసి రథశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి వరకు వివిధ రకాల నృత్య ప్రదర్శన, కోలాటం, చెక్కభజన, తప్పెటచిందు, వేదమంత్రాల మధ్య గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

గజ వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : భక్తులను అలరించేందుకు ఆలయ దక్షిణ మాడ వీధుల్లో నిత్య కళా వేదికపై సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10.30 గంటల వరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి కాలరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఇఒ రామానుజన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

జిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

జిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు సత్య ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నిరవధిక దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిపిఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. జిపిఎస్‌లో 33 సంవత్సరాల సర్వీసు ఉంటేనే 50 శాతం పెన్షన్ మంజూరుకు అవకాశమని తెలపడం ఉద్యోగ, ఉపాధ్యాయులను అన్యాయం చేయడమేన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ప్రతాప్, గౌరవా ధ్యక్షులు బి సుధాకర్, ఉపాధ్యక్షులు చల్లా కృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి విజయ్ కుమార్, సిపిఎస్ కన్వీనర్ లక్ష్మీ నాయక్, జిల్లా కౌన్సిలర్లు కెఎం.నాగరాజు, కె.గోపాల్,ే కె.మల్లికార్జున, టి.మదన గోపాల్, ఎస్.సుధాకర్, ఎం. సతీష్ కుమార్ లు పాల్గొన్నారు.

దీక్షలు నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మృతి చెందిన కార్మికులు దస్తగిరి, హరీష్

ట్రాక్టర్ బోల్తా - ఇద్దరు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల నుండి బలగాలపల్లి వైపు వెళ్లే రహదారిలోని గులాయిలు మలుపుల వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో ఇద్దరు లోడింగ్ కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల మేరకు.. శనివారం నాడు బేతంచెర్ల నుండి పలుకూరు నాపరాయి లోడ్ కోసం వెళ్తున్న ట్రాక్టర్ కస్తూర్బా స్కూలు దాటిన తర్వాత గులాయిలు మొదటి మలుపు వద్ద అదుపుతప్పి దాదాపు 15 అడుగుల ఎత్తు నుండి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్లలో ఉన్న బేతంచర్ల పట్టణానికి చెందిన దస్తగిరి, బలపాలపల్లి గ్రామానికి చెందిన హరీష్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. లక్ష్మీదేవి అనే మహిళకు రెండు కాళ్లు విరిగాయి. రామలక్ష్మమ్మ అనే మహిళకు, మరో కార్మికుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. మృతదేహాలను బనగానపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలించారు. బేతంచర్ల పోలీసు వారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని స్థానిక ఎపిఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో 1997-99 పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు గీత, ఉషారాణి, పార్వతీదేవి, మాధవిలత, ఉమ, సౌభాగ్య, లక్ష్మీ ప్రసన్న, మహేశ్వరరెడ్డి, జెపి సార్, గౌసియా, వరలక్ష్మి తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. 25 సంవత్సరాల క్రితం చేసిన అల్లరి, గడచిన, రోజులు, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, జీవనోపాధి మార్గాలు అన్నింటినీ ఒకరికొకరు పంచుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కోలా లక్ష్మిదేవి, కమిటీ సభ్యులు శ్యామల, చెన్నమ్మ, వినీల, భాగ్యవేణి , శ్రీవాణి, టిసి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికలతో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థినులు

రీ సర్వేను వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అన్ని మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, స్పందన గ్రీవెన్స్, ఆర్ఒఆర్ కేసులు, ఎపిసేవా సర్వీసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ, పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూములు, పౌరసరఫరాలు, కోర్టు కేసులు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు సంబంధించి స్పందన కార్యక్రమంలో అనేక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత తహశీల్దారులు, విఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని తహశీల్దార్లకు సూచించారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నిర్దేశించిన రీ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిశితంగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సర్వే బృందాలు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర ప్రక్రియలను ఆర్డీవోలు పరిశీలించా లన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్తున్నాయని పలుమార్లు సూచించినప్పటికీ సంబంధిత తహశీల్దారులు, వీఆర్వోలు అశ్రద్ధ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్లో ఉన్న గ్రామాల అవార్డ్సును పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి నిత్యవసర సరుకుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పుల్లయ్య, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

వైసిపి జిల్లా కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో వైసిపి జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి విద్యుత్, అటవీశాఖ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డిలు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంజాద్ బాష, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తోగూరు ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఎంపిపి శెట్టి ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిపి మధుసూధన్ రెడ్డి, డా.మిద్దె శాంతిరాముడు, శివరాం, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

శ్రీశైలం నుండి బెంగళూర్‌కు స్లీపర్ కోచ్ హైర్‌బస్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం నుండి బెంగళూర్‌కు స్లీపర్ కోచ్ హైర్ బస్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఆత్మకూరు ఆర్‌టిసి డిపో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీశైలం నుండి బెంగళూర్‌కు వెళ్లేందుకు స్లీపర్ కోచ్‌లో ప్రయా ణం చేసేందుకు యాత్రికులు ఎక్కువగా ఇష్టపడుతుండడంతో ఆర్‌టిసి యాజమాన్యం చర్యలు చేపడుతోంది. ఇటీవల కాలంలో శ్రీశైలం నుండి బెంగళూర్‌కు, బెంగళూర్ నుండి శ్రీశైలంకు స్లీపర్ కోచ్ బస్ నడిపేందుకు టెండర్లను పిలవడం జరిగింది. టెండర్లను ఖరారు చేసి నడపనున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం ఉన్న సమయంలోనే బస్‌ను నడపనున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తనంద్యాల పట్టనంలోని డిఇఒ కార్యాలయంలో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్ సంబరాలు-2023 క్యాలెండర్‌ను, చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను డిఇఒ కె.సుధాకర్ రెడ్డి, జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ టి.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులందరూ చెకుముఖి టాలెంట్ టెస్టులలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బేగ్, నంద్యాల ఎంఇఒలు బ్రహ్మం, లలిత, జెవివి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి నంద్యాల పట్టణ కమిటీ ఎన్నిక : జెవివి నంద్యాల పట్టణ కమిటీ అధ్యక్షులుగా టి.చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా ఓ నాగేంద్రలు ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారికి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు రామరాజు, గురుస్వామి, గోపాల్, పునీత్ శ్రీనివాస్ బాబు, నేషనల్ గ్రీన్ కోర్ కమిటీ కో-ఆర్డినేటర్ సిహెచ్ చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఇఒ తదితరులు

త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్.అబ్దుల్ రహమాన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి యస్.అబ్దుల్ రహిమాన్ తెలిపారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 28 మండలాల రైతులు సాగు చేస్తున్న పత్తి పంట వివరాలు, పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం నంద్యాల పట్టణంలో ఉన్న శ్రీ మురారి పవన్ ఆగ్రో టెక్ జిన్నింగు మిల్లుకు తీసుకువెళ్లి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7020కు అమ్ముకోవచ్చని చెప్పారు. రైతులు మధ్యవర్తులు, దళారుల వద్దకు వెళ్ళకుండా పత్తిని కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేసిన జిన్నింగు మిల్లులు మార్కెట్ యార్డుల వద్దకు ఎవరైనా దళారులు, మధ్యవర్తులు వస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్.అబ్దుల్ రహమాన్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి దేవాలయంలో రూ. 2 కోట్ల 7 లక్షలతో నూతన స్టీల్ క్యూ లైన్ నిర్మాణం, షెడ్లు ఏర్పాటు చేసేందుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ రామకృష్ణ, గ్రామ పెద్దలు బీరం రాజేశ్వరి, మిలటరీ సుబ్బారెడ్డి, వీరయ్య స్వామి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, కిట్టయ్య స్వామి, దేవస్థాన సిబ్బంది

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని ఆలయాలలో దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం పాల్గొన్నారు. ముందుగా పాత బస్టాండు లోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామీ ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధ్యక్షుడు కొండయ్య ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పండుగల వల్ల ప్రజలలో ఐక్యత ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడ,జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు బాబుబాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి,వైసీపీ నాయకులు జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వెంకటరమణ, ఆర్ఎస్‌రమణ, పెద్దరాముడు, స్వామిరెడ్డి, నాగేంద్ర,బచ్చు సుబ్రమాణ్యం,ఐడియా బాబు,ఆర్యవైశ్య సంఘం నాయకులు క్రిష్ణం శివప్రసాద్,తొమ్మంద్రు మల్లికార్జున,నవత ప్రసాద్, నరసింహ, సునీల్,ఆదవేని రవి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పైపుల నిర్మాణాన్ని అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని సంకిరేణి పల్లె గ్రామం నుంచి పగిడ్యాల గ్రామానికి సరఫరా చేసే నూతన పైపులు నిర్మాణాన్ని ఎంపీడీవో వెంకటరమణ, ఈఓఆర్‌డి నాగేంద్రయ్య, శనివారం పరిశీలించారు. ఇటీవల గత నెలలో కలుషితమై నీరు తాగి ప్రజలు గ్రామంలో అతిసార వ్యాధికి గురై వాంతులు విరోచనాలు వైద్యశాలలో చేరారు. పగిడ్యాల గ్రామం గండి సమీపాన ఉన్న పైపు లైన్‌లో కలుషిత నీరు చేరి ఆ నీటి వల్లనే గ్రామ ప్రజలకు వాంతులు విరోచనాలు అయ్యాయి. దీంతో అధికారులు స్పందించి పాత పైపులైను తొలగించి నూతన పైపులైను నిర్మాణాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎఇ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైపుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం నాడు జూపాడుబంగ్లా మండలం తంగడంచ గ్రామంలో రైతు సంఘం నాయకులు మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో వర్షాభావ పరిస్థితి వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయాని, అతివృష్టి, అనావృష్టి, కల్తీ విత్తనాల వల్ల ఒకటికి రెండుసార్లు

మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

విత్తనాలువేసిన పంటలను కూడా చెడగొట్టి రైతులు మళ్లీ విత్తనాలు వేసినా దిగుబడి సరిగా రావడంలేదన్నారు. మొక్కజొన్న ఎకరాకు 5 నుంచి 15 కింటాల్ లోపు మాత్రమే దిగుబడి వస్తోందని అన్నారు. ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.1800, రూ.1900 కొనుగోలు చేస్తున్నారని, అందువల్ల వచ్చినకొద్దిపాటి మొక్కజొన్నలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు కోరారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి వెంటనే సహాయక చర్యలు చేపట్టి, పంటల బీమా వర్తింపజేయాలని, నష్టపోయిన పంటలన్నిటికీ పత్తి, మిర్చికి ఎకరాకు రూ. 50,000, మొక్కజొన్న, కంది తదితర పంటలకు ఎకరాకు రూ.30,000, రబీలో అన్ని రకాల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పేదలందరికీ వైద్యమందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పేదలందరికీ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, ఎంపిడిఒ జీవి ప్రసాద్ రెడ్డి, నందిపాడు సర్పంచి ఆర్.గురివిరెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి పాల్గొన్నారు. వైస్సార్ కంటి వెలుగు కింద కంటి సమస్య ఉన్నవారికి కళ్లద్దాలు పంపిణీ చేశాఉ. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేష్, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **బనగానపల్లె :** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజా ఆరోగ్యానికి భరోసాలాంటిదని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. మండలంలోని కైప గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. అప్పలాపురం, శంకరాపురం, విఠలాపురం గ్రామాల ప్రజలకు టంగుటూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గాలి వీరారెడ్డి, ప్రతాపరెడ్డి, దస్తగిరి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శివరామయ్య

దీక్షకు తరలి వెళ్తున్న ఉపాధ్యాయులు

ఆక్రందన దీక్షకు తరలిన నేతలు

ప్రజాశక్తి - చాగలమర్రి

దీర్ఘకాలిక ఆర్థిక బకాయిలు చెల్లించాలని మండల ఎస్‌టియు అధ్యక్షుడు మస్తాన్ బాష ఆధ్వర్యంలో ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ఆక్రందన దీక్షకు జిల్లా కేంద్రానికి శనివారం తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి మాబు హుస్సేన్, రాష్ట్ర కౌన్సిలర్లు శివ శంకర్, ప్రసాద్, మాజీ అధ్యక్షులు సంజీవ రెడ్డి కార్యవర్గ సభ్యులు సురేషప్ప, శాస్త్రి, వై శ్రీనివాసులు, వెంకట ప్రసాద్, యన్. ప్రసాద్,పుట్టాలయ్య, స్వామిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ పంపిణీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని గోకుల్ గ్యాస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌ను అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని గోకుల్ గ్యాస్ డీలర్ జిసి వెంకట్ అన్నారు. శనివారం నాడు గోకుల్ గ్యాస్ ఆఫీస్ నందు డీలర్ జిసి వెంకట్ ఆధ్వర్యంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా మహిళా సంక్షేమానికి తోడ్పాటు అందిస్తూ ప్రస్తుతం ఇంతవరకు గ్యాస్ కలెక్షన్ లేని తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, సిలిండర్ స్టౌవ్‌ను అందజేయడం జరుగుతుందని అన్నారు.

గ్యాస్ పొయ్యిలను పంపిణీ చేస్తున్న డీలర్ జి సీ వెంకట్

శమీ వృక్షాన్ని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆత్మకూరు రోడ్డులో గల జమ్మి చెట్టు (శమీ వృక్షాన్ని) విజయదశమి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, పగిడ్యాల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, ఆర్.సి రెడ్డి విద్యాసంస్థల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి,స్రవంతి దంపతులు, ఉత్సవ సమితి సభ్యులు బద్దుల శ్రీకాంత్, శ్రీ నవనంది విద్యాసంస్థల అధినేత బద్దుల శ్రీధర్, తదితరులు దర్శించుకున్నారు. నందికొట్కూరు పట్టణ ఉపాధ్యక్షులు చింతా విజ్జి, వార్డు ఇంచార్జ్ ఆర్ట్

శమీ వృక్షానికి పూజలు చేస్తున్న ప్రముఖులు

కాలినడక భక్తులకు ఏర్పాట్లు చేయండి : ఇఓ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం పాతాళగంగమెట్ల మార్గంలో నడిచి వెళ్ళే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పరిపాలన అంశాల పరిశీలనలో భాగంగా శనివారం నాడు ఆయన అధికారులతో కలిసి పాతాళంగా మెట్ల మార్గాన్ని పాదాల గంగను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ల మార్గంలో భక్తులు కోసం తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, భక్తులు సేద తీరేందుకు ఏర్పాట్లను చేయాలని సూచించారు. విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతూ ఉండే విధంగా మరిన్ని విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ చర్యలలో భాగంగా పాతాళ గంగలో బార్కెడ్లు నిరంతరం పరిశీలిస్తుండాలని నీటిమట్టం కనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఇఓ

పాతాళ గంగలో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం శ్రీ గోకులం పనులను, యాంపి థియేటర్‌ను ఇఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, ఎఇ రాజేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ డాక్టర్లు

వైద్యులు, ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆసుపత్రులు, వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ విజ్ఞప్తి చేశారు. భారతీయ వైద్య సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అనుబంధంగా ఆత్మకూరులో ఐఎంఏ శాఖను రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ గోవిందరాజులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్యులు ఐక్యమత్యంతో ఉండాలని, వైద్యాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా మానవతా కోణం నుంచి వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి, వైద్యులు వృత్తిలో ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించడానికి ఐఎంఏ రాష్ట్ర శాఖ అండగా నిలబడుతుందని చెప్పారు. ఐఎంఎ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తి సంఘమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 1750 శాఖలలో 4 లక్షల మంది వైద్యులు సభ్యులుగా వున్నారని, మన రాష్ట్రంలో 98 శాఖలలో 20 వేల మంది పైగా సభ్యులున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో ఆసుపత్రులపై, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయని, వాటిని నివారి ంచేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తక్షణం తీసుకురావాలని కోరారు. అనంతరం సీనియర్ వైద్యులు డాక్టర్ గౌరీనాద్‌ను రాష్ట్ర శాఖ తరపున సత్కరించి అభినందించారు. సమావేశం లో రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఆత్మకూరు శాఖ కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ నాగ మహేశ్వరి, కోశాధికారి డాక్టర్ శేఖర్, సీనియర్ వైద్యులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ రాయుడు, ఆత్మకూరు వైద్యులు పాల్గొన్నారు.

వైసిపికి బుద్ధి చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ :

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో మహిళలు బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం మహిళా శక్తి కన్వీనర్ గంగాదేవి అన్నారు. శనివారం జిసి పాలెం గ్రామంలో తెలుగుదేశం నాయకులు కూసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అధ్యక్షతన మహిళ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం మానిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఉచిత ప్రయాణం, సున్నా వడ్డీ తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు బయట ఉంటే ఇంకా అనేక పథకాలను ప్రవేశపెడతారని జైల్లో పెట్టడం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తాడికొండ బుగ్గ రాముడు, జాకీర్ ఖాన్, కూసు చిన్న లింగారెడ్డి, శివుడు మహిళలు

అవినీతికి తావు లేకుండా ఉపాధి పనులు చేపట్టాలి

- జిల్లా విచారణ అధికారి భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - పగిడ్యాల

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతికి తావు లేకుండా పనులు చేపట్టాలని జిల్లా విచారణ అధికారి భాస్కర్ నాయుడు ఉపాధి సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రం పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2022 -23 సంవత్సరములో చేపట్టిన 17వ సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పనులలో అవినీతి జరిగి అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. మండలంలో 2022-23 జరిగిన 668 పనులకు గాను రూ 5.29 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. రూ 11700 రికవరికి ఆదేశించడం జరిగిందన్నారు. రూ 102275కు రిసిప్ట్ చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్, ఎపిడి అన్వర వేగం, ఎంపీడీవో వెంకటరమణ, ఎస్ఆర్ పి నీలకంఠం, పిఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఇఓఆర్‌డి నాగేంద్రయ్య, ఎంఈఓ మురళీధర్ రెడ్డి, ఏపీవో మద్దిలేటి, ఈసీ అశోక్, ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ చర్చలో మాట్లాడుతున్న అధికారులు

నేటి పరిస్థితుల్లో ఆదర్శ ధర్మం కావాలి

- జెవివి జాతీయ కార్యదర్శి డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆదర్శ ధర్మం కావాలని జెవివి జాతీయ కార్యదర్శి డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. భగత్ సింగ్ లైబ్రరీ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా నగర్‌లోని భగత్ సింగ్ లైబ్రరీ సమావేశ భవనంలో బోర్డు సభ్యులు డాక్టర్ నాగరాజు అధ్యక్షతన సనాతన ధర్మంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా డాక్టర్ బ్రహ్మారెడ్డి హాజరై మాట్లాడారు. మారే కాలానికి అనుగుణంగా ధర్మం మారుతూ ఉంటుందని అన్నారు. గతంలో ఆ కాల పరిస్థితికి అనుగుణంగా పుట్టుకు వచ్చినదే మనుధర్మమని, అది నేడు మారిన పరిస్థితిలో చెల్లుబాటు కాదన్నారు. మనుధర్మంలో మహిళలకు ఎలాంటి హక్కులు లేవని, కేవలం పురుషులపై ఆధారపడి వంటింటికి పరిమితమై జీవితం గడిపేవారన్నారు. నేడు మారిన పరిస్థితుల్లో మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో పని చేస్తున్నారని చెప్పారు. ఒకే కులంలో మేనరికాల్లో వివాహాలు చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టరని సైన్స్ తేల్చి చెబుతుందన్నారు. మానవ మేధస్సు మరింతగా ఎదగాలంటే ఆదర్శ ధర్మం అవసరమని అన్నారు. నేటి యువత ఆలోచన ధోరణి మారిందని, అందుకు అనుగుణమైన తరతమ అంతరాలు లేని ధర్మం అవసరమన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు ముర్తుజా, టిడిపి నాయకులు వి.రామచంద్ర రావు, లైబ్రరీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బి.శంకరయ్య, బోర్డు సభ్యులు రామకృష్ణ రెడ్డి, మాదాల శ్రీనివాసులు, గండు మాధవరావు, జెవివి నాయకులు రామరాజు, సిఐటియు నాయకులు కెఎండి.గౌస్, విశ్రాంత ఉద్యోగులు, లాయర్లు, ఉపాధ్యాయులు, పలు రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

- దూదేకుల సంఘం

ప్రజాశక్తి - పాములపాడు

ఈనెల 29వ తేదీన గుంటూరులో నిర్వహించే దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయాలని దూదేకుల సంఘం మండలా ధ్యక్షుడు మౌలా హుస్సేన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సింహ గర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల దూదేకుల జనాభా ఉన్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటర్లుగా మాత్రమే గుర్తించడం బాధాకరమన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు దూదేకుల వారికి చట్టసభలలో తగిన ప్రాతినిథ్యం కల్పించాలని, అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనార్టీ పదవులలో వర్గీకరణ దామాషా ప్రకారం దూదేకుల పదవులు బడ్జెట్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే దూదేకులకు చట్టసభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. దూదేకుల కులస్తులందరూ సింహగర్జనకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అలీ బాష, హుస్సేన్, సిద్దయ్య, మౌలా, పకీరయ్య, ముర్తుజావలి, చిన్న డాల్ స్వామి, మౌలా హుస్సేన్, ఇస్మాయిల్, హుస్సేన్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విరాళం అందజేస్తున్న ఎస్ఐ అశోక్

ఆలయ నిర్మాణానికి ఎస్ఐ విరాళం

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని జూటూరు గ్రామంలో ఇదివరకున్న జములమ్మ గుడి నేషనల్ హైవేలో పోవడంతో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన గుడి నిర్మాణానికి పాములపాడు ఎస్ఐ జి అశోక్ విరాళం అందజేశారు. గర్భగుడి మండపం నిర్మించేందుకు దాతలు దేవర మురళి గౌడ్, దేవర ప్రతాప్ గౌడ్, దేవర భాస్కర్ గౌడ్ ముందుకు వచ్చారు. ఈ నిర్మాణంలో భాగంగా శనివారం ద్వారక మందిరంలో పూజలు నిర్వహించారు. పూజలకు ముఖ్య అతిథులుగా ఎస్సై జి అశోక్, సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, దాతలు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో అన్ని మతాలను గౌరవించుకుంటూ స్నేహభావంగా ఉంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. గుడి నిర్మాణానికి విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థల దాత బొందిలి రామకృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బేతంచర్ల

విఆర్ఎ కుటుంబానికి విఆర్ఎల సంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్న తలారి లక్ష్మీదేవి (48) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందడం జరిగింది. సమాచారం తెలుసుకున్న వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నంది పల్లె నాగేష్, వీఆర్ఏలు కైలాస్ చంద్ర, ఎస్కే బాష తదితరులు కలిసి మృతి చెందిన లక్ష్మీదేవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుం బానికి వీఆర్ఏల సంఘం తరఫున రూ.22 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు.

ఆర్థిక సాయం చేస్తున్న నేతలు

ప్రభుత్వాసుపత్రికి జిడిపి వాటర్ కనెక్షన్ పూర్తి

ప్రజాశక్తి-డోన్

ప్రభుత్వాసుపత్రికి రూ.30 లక్షలతో జిడిపి వాటర్ కనెక్షన్‌ను పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ హాస్పటల్‌లో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు జిడిపి వాటర్‌ను ప్రభుత్వ ఆసుపత్రి వరకు పైప్‌లైన్ వేయించడం జరిగిందని, శనివారం ట్రయిల్ రన్ పూర్తి చేసి వాటర్‌ను హాస్పటల్‌కు అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు త్రాగునీటి పట్ల ఎటువంటి అసౌకర్యాలకు గురి కాకుండా ముందు జాగ్రత్తగా జిడిపి వాటర్ కనెక్షన్‌ను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగేంద్ర,మున్సిపల్ డిఈ రసూల్, మున్సిపల్ ఏఈ సురేష్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ అధికార యంత్రాంగానికి మద్రాస్ హైకోర్టు తీర్పు చెంపపెట్టు : రైతు సంఘం

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - బేతంచర్ల

నిరంకుశ అధికార యంత్రాంగానికి మద్రాస్ హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్యలు అన్నారు. శనివారం స్థానిక మండలంలోని ఆర్ఎస్.రంగాపురం గ్రామంలో రైతు సంఘం బేతంచెర్ల మండల అధ్యక్షుడు సీతారాపురం జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వి.సుబ్బరాయుడు, ఆర్.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లాలో అడవిలో తట్టెనా వాచాతి, రాష్ట్రంలోని వాకపల్లి గ్రామాల్లో 1992 జూన్ 20న ఈ రెండు గ్రామాలపై దండెత్తిన అటవీ అధికారులు, వారికి మద్దతుగా రెవెన్యూ, పోలీస్ అధికారులు చేసిన దుర్మార్గాలకు సమాధానమే మద్రాస్ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అన్నారు. గిరిజన మహిళలు,ప్రజలపై దుర్మార్గానికి ఒడిగట్టిన 215 మంది ఫారెస్ట్, రెవెన్యూ పోలీసు అధికారులు, తదితర సిబ్బందిని దోషులుగా నిర్ధారించి శిక్ష అనుభవించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించిందన్నారు.

ఎర్రచందనం చెట్లు కొడుతున్నారని నెపంతో సామాన్యులను చిత్రహింసలకు గురిచేశారని అన్నారు. గిరిజనులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తమిళనాడు ట్రైబల్ అసోసియేషన్, మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, తదితర ప్రజా సంఘాలతో పాటు సిపిఎం పార్టీ బాధిత ప్రజలకు అండగా నిలిచాయన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు విజయం సాధించి పోరాడే ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ విజయోత్సవ సభలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం బేతంచర్ల మండల కార్యవుదర్శి పి.రామ్ మోహన్,ఎన్.వి. కృష్ణారెడ్డి, యస్.మాబూబాషా,సిఐటియు మండల కార్యదర్శి యస్.రహంతుల్లా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటి సభ్యులు దారం పెద్ద పుల్లారెడ్డి, రాఘవరెడ్డి,తెలుగు నాగరాజు, రాముడు, భాస్కర్, తిమ్మయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని కురువ పేట నందు గల నిరాశ్రయుల వసతి గృహము నందు జువ్వాజి సుంకన్న సేవా సమితి, చౌడేశ్వరి దేవి సేవా సమితిల ఆధ్వర్యంలో శనివారం మహేష్ డబు భార్య మేఘన డబు జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాశ్రయులకు పట్టెడు అన్నం పెట్టడంలో ఎంతో సంతోషం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి శ్రీనివాసులు, సాయి చైతన్య, రాఘవేంద్ర, మహేష్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

లలిత త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి దేవి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ శ్రీ రామ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, గౌరవ సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, సెక్రటరీ గూండా రవికుమార్, గుండా శ్రీనివాసులు, మింగిమల్ల హనుమాన్, జక్కా నాగరాజు, నల్లగట్ల వెంకటేశ్వర్ల, పిఎస్ఎన్ సత్యం నూకల సుబ్బయ్య, టంగుటూరు శీనయ్య, సభ్యులు. పాల్గొన్నారు.

వారాహిదేవిగా అమ్మవారు

డోన్ : దసరా నవరాత్రులలో భాగంగా ఏడవ రోజు డోన్ పట్టణంలోని పాతపేటలో ఉన్న అమ్మవారిశాలలో శనివారం వారాహిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారిశాలనందుఅమ్మవారికి కుంకుమార్చన,అభిషేకం,మంగళహారతి,పల్లకి సేవ,హెూమాలు అమ్మవారి సన్నిధిలో సేవలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట్రికె హరికిషన్,సెక్రటరీ పివి.రంగయ్య,కోశాధికారి చాటకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. వారాహిదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం